తల్లీబిడ్డకు రక్షణ పీఎంఎంవీవై

- పీఎంఎంవీవై కింద రూ.ఐదు వేల సాయం
- గర్భిణులకు మూడు విడతలుగా చెల్లింపు
- మలికాన్పులో ఆడపిల్ల పుట్టినా పథకం వర్తింపు
- కొవ్వూరు డివిజన్లో 2,917 మంది గర్భిణులు


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

నిడదవోలు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం మాతా శిశు సంరక్షణ కోసం దోహదపడుతుంది. పేద, మధ్యతరగతికి చెందిన గర్భిణులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఈ పథకాన్ని 2010లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజన (ఐజీఎంఎస్‌వై) పథకంగా ప్రారంభించబడింది. ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2016లో ఆ పథకం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజనగా మార్పు చేశారు. ఈ పథకం మరింత మందికి లబ్ధి చేకూరాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. పథకాన్ని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి మరిన్ని మార్పులు చేసిన తర్వాత అమల్లోకి తీసుకువచ్చింది. పీఎంఎంవీవై ద్వారా అందించే నగదు ప్రోత్సాహకాల ద్వారా గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు నవజాత శిశు సంరక్షణకు, వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న 20 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో మొత్తం 2,917 మంది గర్భిణులను నమోదు చేసినట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. వీరిలో ఇప్పటి వరకు 2,629 మంది గర్భిణులకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఈ పథకాన్ని గర్భిణులకు వర్తింపజేసే విధంగా ఆరోగ్య సిబ్బంది నమోదు ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణులను గుర్తించి వైద్యశాఖ రికార్డుల్లో పొందుపరుస్తున్నారు. దీంతో పాటు గత మూడేళ్లుగా నమోదు చేసుకొని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తుంది. దీంతో ఈ పథకం ద్వారా లబ్ధి పొందే మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది.

పీఎంఎంవీవై పథకానికి కావలసిన అర్హతలు

- గర్భం దాల్చిన మూడు నెలల్లోపు పీఎంఎంవీవై పథకం కోసం వార్డు, గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్లో పేరును నమోదు చేయించుకోవాలి.
- గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డు కలిగి ఉండాలి
- 19 సంవత్సరాలు నిండిన తర్వాత గర్భం దాల్చిన మహిళలపై ఈ పథకం వర్తిస్తుంది
- పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతినెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎంవీవై శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలి.

నగదు చెల్లింపు ఇలా..

- గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం పూర్తయ్యేలోపు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా మూడు విడతల్లో రూ.ఐదు వేలు చెల్లిస్తారు .
- మొదటివిడతగా అంగన్వాడీ కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో గర్భిణిగా నమోదైన వెంటనే రూ.1000 లబ్ధిదారునికి బ్యాంకు ఖాతాలో జమవుతుంది.
- గర్భం దాల్చిన ఆరునెలల పాటు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ తీసుకున్న గర్భిణికి రెండో విడతగా రూ.రెండు వేలు అందజేస్తున్నారు.
- గర్భిణికి ప్రసవం అయిన తర్వాత మూడో విడతగా రూ. రెండు వేలు చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం నవజాత శిశువు, తల్లుల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన పీఎంఎంవీవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి నెల అర్బన్ హెల్త్ గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాం. నిర్ణీత సమయంలో గర్భిణుల వివరాల నమోదు చేసుకుని పథకం లబ్ధిని పొందాలి. ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఈ.తేజశ్రీ, వైద్యాధికారి, నిడదవోలు

విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం



పీఎంఎంవీవై పథకం ఆవశ్యకత, గర్భిణులకు కలిగే ప్రయోజనాలపై విరివిగా అవగాహన కల్పిస్తున్నాం. అర్హులందరికీ ఈ పథకం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. గర్భిణులను నమోదు చేసిన ప్రతి ఒక్కరికీ ఎంసీపీ కార్డు అందజేస్తున్నాం.

– కారింకి లక్ష్మీపార్వతి, ఏఎన్‌ఎం, నిడదవోలు

క్లుప్తంగా

వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తలారి


చాగల్లులో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

చాగల్లు: స్థానిక వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు జె.వెంకట్రావు కుమారుడు వివాహ వేడుకలకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం హాజరైయ్యారు. నూతన వధూవరులను వెంకట్రావు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, నాయకులు గెడా శ్యామ్, బొర్రా కృష్ణ, ఇంటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆకుకూరల స్టాల్ ఏర్పాటు


దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సేంద్రియ ఆకుకూరల స్టాల్

దేవరపల్లి: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలను మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బంది స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలను తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం స్టాల్ ఏర్పాటు చేసి, వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు విక్రయించారు. దేవరపల్లి, పల్లంట్ల సిబ్బంది ఈ స్టాల్ ఏర్పాటు చేశారు.

భారీ అన్నసమారాధన


అన్నసమారాధనకు తరలివచ్చిన భక్తులు

దేవరపల్లి: మహాశివరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా దేవరపల్లిలోని పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యాన భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అన్న సమారాధన జరిగింది. పరిసర గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

పుష్కరాలకు ముందస్తు పనులు చేపట్టండి

కొవ్వూరు: రానున్న గోదావరి పుష్కరాల సమయానికి నదీ తీరంలో ఉన్న స్నానఘట్టాల అభివృద్ధి, కొత్త స్నానఘట్టాల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో సోమవారం ఆయన పుష్కరాలపై మాట్లాడారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన కుంభమేళాలో చేసిన ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విజ్జేశ్వరం నుంచి తాడిపూడి వరకూ 20 కిలో మీటర్ల మేర నదీతీరం ఉందన్నారు. పవిత్ర గోష్పాదక్షేత్రంలో నిత్యం వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు, పూజలు, పిండ ప్రదానాలు చేస్తారన్నారు. ఈ క్షేత్రంలో అవసరమైన పనులకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోదావరి మహా పుష్కరాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిస్తారన్నారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి


తాడేపల్లిలో మంత్రి సత్యప్రసాద్‌కు రైతుల సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు: నియోజకవర్గం పరిధిలోని పశివేదల, దొమ్మేరు, నందమూరు, వేములూరు గ్రామాల్లో వక్ఫ్ బోర్డు, ఈనాం భూములకు సంబంధించి 22ఏ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం తాడేపల్లిలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ భూములను సాగు చేస్తున్న రైతుల ఇబ్బందులను మంత్రికి వివరించారు. రైతుల సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు


వ్యాస రచన పోటీలను పర్యవేక్షిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు: పట్టణంలోని అల్లూరి నాగరత్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళలపై వివక్షత–పురుషుల పాత్ర అనే అంశంపై సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 8వ తేదీన బహుమతులు అందజేస్తామని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: పట్టణంలోని శ్రీరామ కాలనీకి చెందిన ఇళ్ల వీరమణి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. తన భర్త వీరబాబు చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తున్నట్టు వీరమణి ఫిర్యాదు పేర్కొంది. ఈ మేరకు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు అండగా ఉంటా


నక్కా నాగ సత్యనారాయణ

నల్లజర్ల: నియోజకవర్గంలోని యువతకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందని పార్టీ యువజన విభాగం గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడు నక్కా నాగ సత్యనారాయణ (పండు) అన్నారు. నల్లజర్లలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారం లేదనే అధైర్యం అవసరం లేదని, ప్రజల పక్షాన పోరాడే శక్తి అందరికీ ఉంటుందని అన్నారు. త్వరలోనే అన్ని మండలాల్లోనూ తిరిగి యూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా మండలాల కార్యకర్తల ద్వారా గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణ పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఉద్యమించే సత్తా ఉన్న వారిని మండల యూత్ అధ్యక్షులుగా నియమిస్తామన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, ఇష్టపడి పార్టీ కోసం కష్టపడే వారే నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుకు నోచుకోవడం లేదని, కూటమి నాయకులు ఇచ్చిన గడువు కూడా అయిపోయిందని చెప్పారు. ఈ పథకాల అమలుకు ఉద్యమించే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు వైఎస్ జగన్ ఇచ్చే ప్రతి పిలుపునకూ అందరూ తక్షణం స్పందించాలని సత్యనారాయణ కోరారు.

పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు సాగునీటి విడుదలను పెంచారు. గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా గత నాలుగు రోజులుగా పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1557 క్యూసెక్కులు, ఏలూరు కాలువలకు 860 క్యూసెక్కులు, తణుకు కాలువకు 547 క్యూసెక్కులు, అత్తిలి కాలువలకు 433 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ రామారావు, శర్మ

ఉండ్రాజవరం: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలన్నారు. ప్రతిరోజు క్లోరినేషన్‌తో పాటు వాటర్ టెస్టింగ్ చేయాలన్నారు. అలాగే మంచినీటి సరఫరాకు ఏ విధమైన ఆటంకం ఏర్పడకుండా పంపింగ్ మోటార్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లోని మంచినీటి చెరువులతో పాటు పశువుల చెరువులను ముందుగానే కాలువ నీటితో నింపుకోవాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం


వేగేశ్వరపురం జూనియర్ కళాశాల వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న ఇంటర్ విద్యార్థులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు/సంస్కృతం పరీక్షలకు 205 మంది విద్యార్థులకు గాను 194 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షా కేంద్రంలో వేగేశ్వరపురం కళాశాలతో పాటు తాళ్లపూడి కరిబండి గనిరాజు సూర్యకుమారి జూనియర్ కళాశాల, తాళ్లపూడి ఒకేషనల్ జూనియర్ కళాశాల, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. చీఫ్ సూపరింటెండెంట్ పి.గౌరీనాథ్, డి.శ్రీనివాస్ పరీక్షలను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

చాగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎగ్జిమినర్ చీఫ్ సూపరింటెండెంట్ పి.పావని తెలిపారు. సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 101 మంది విద్యార్థులకు గాను 97 మంది హాజరయ్యారని చెప్పారు.

ఫీజు లేని వైద్యుడు

- ఆరు దశాబ్దాలుగా పీఎంపీ సూర్యచంద్రరావు సేవలు
- పేదల డాక్టర్‌గా పేరు


పుల్లలపాడులో ఇంటి వద్ద ప్రజలకు వైద్యం చేస్తున్న డాక్టర్ సూర్యచంద్రరావు

నల్లజర్ల: ముదిమి మీద పడినా.. 80 సంవత్సరాల వయస్సులోనూ ఆయన వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. వైద్య రంగం పూర్తిగా వ్యాపారమయమైన ప్రస్తుత పరిస్థితుల్లో సైతం ఆయన తన వద్దకు వచ్చిన రోగుల నుంచి పైసా కూడా ఫీజు తీసుకోరు. గడచిన ఆరు దశాబ్దాలుగా.. అర్ధరాత్రి, అపరాత్రి అని లేదు.. అనారోగ్యంతో ఎవరు వచ్చి తన ఇంటి తలుపు తట్టినా వైద్యం అందిస్తున్నారు. మండలంలోని పుల్లలపాడు గ్రామానికి చెందిన ఆ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) పేరు డాక్టర్ అల్లూరి సూర్యచంద్రరావు. 2021లో పుల్లలపాడు సర్పంచ్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఇదే గ్రామంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా సైతం ఎన్నికయ్యారు. వైద్య విధాన పరిషత్ ద్వారా వైద్యంలో శిక్షణ పొందిన ఆయన.. తొలుత దూబచర్ల ఆయుర్వేద డిస్పెన్సరీలో 25 సంవత్సరాల పాటు వైద్య సేవలు అందించారు. 2001లో ఉద్యోగ విరమణ అనంతరం నల్లజర్లలో డాక్టర్ నల్లూరి వెంకటపతి వద్ద ఇంగ్లిషు వైద్యంలో శిక్షణ పొందారు. తన పరిధిలో తగ్గే రోగాలకు మాత్రమే ఆయన తన ఇంటి వద్దనే చికిత్స చేస్తారు. ఏ ఒక్కరి వద్ద ఫీజు తీసుకోరు. వ్యాధి తీవ్రతను గుర్తించి, తన దగ్గర తగ్గదని భావిస్తే వెంటనే పెద్ద వైద్యుల వద్దకు పంపిస్తూంటారు. అలాగని, ఆయా ఆసుపత్రుల వద్ద లేదా ల్యాబ్‌లు, మందుల షాపుల వద్ద ఒక్క రూపాయి కూడా కమీషన్ తీసుకోరు. పెద్ద వైద్యులు సైతం నయం చేయలేని మొండి జబ్బులను సైతం డాక్టర్ సూర్యచంద్రరావు తన అనుభవంతో నయం చేస్తారని ఈ ప్రాంత ప్రజలు చెబుతూంటారు.

ఆరోగ్య, సామాజిక అంశాలపై అవగాహనకు కృషి

ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మధుమేహం, బీపీ బారిన పడుతున్నారని, కనీసం గంటపాటు చిన్నపాటి వ్యాయామాలు చేస్తే ఈ వ్యాధులను నివారించవచ్చని సూర్యచంద్రరావు అన్నారు. అవకాశం ఉన్నప్పటికీ దీనిపై సరైన అవగాహన లేక చాలా మంది రోగాల బారిన పడుతున్నారన్నారు. అవసరమైతేనే తప్ప బైక్‌లు, కార్లు వినియోగించవద్దని, నడిచి వెళ్లలేని పక్షంలో సైకిల్ వినియోగిస్తే మేలని అంటున్నారు. తన వద్దకు వచ్చే రోగులు రకరకాల వ్యాధుల నుంచి బయట పడేందుకు చేయాల్సిన వ్యాయామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరిస్తూంటారు. సైక్లిస్టులు సైతం హెల్మెట్ ధరించడం మేలని చెబుతున్నారు.

ప్రమాదకరంగా మలుపులు


పల్లంట్ల - చిక్కాల రోడ్డులో ప్రమాదకరమైన మలుపు


పల్లంట్ల సమీపాన నిత్యం ప్రమాదాలు జరుగుతున్న మలుపు

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల – చిక్కాల రోడ్డులో పలు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గంలో సుమారు 12 మలుపులున్నాయి. ఇవి దగ్గరదగ్గరగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దేవరపల్లి నుంచి నిడదవోలుకు దగ్గర మార్గం కావడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో జీడిగింజల పరిశ్రమలు ఉండటంతో ఆటోలు, వ్యాన్లు కూడా ఎక్కువగా తిరుగుతూంటాయి. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలు పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద ముళ్ల పొదలను తొలగించి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

పీఆర్‌టీయూ నాయకుల విజయోత్సవాలు


సమిశ్రగూడెం ఎంఈఓ కార్యాలయంలో స్వీట్స్ పంచుతున్న పీఆర్‌టీయూ నాయకులు

నిడదవోలు రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీ చేసిన గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంతో పీఆర్‌టీయూ నాయకులు సోమవారం విజయోత్సవాలు నిర్వహించారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంఈఓ కార్యాలయం వద్ద స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఎంఈఓలు కేఎస్‌వీ గణేష్, పి.గురుమూర్తి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు చిర్రా గౌతం అశోక్‌బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఐవీ రమణ, రాష్ట్ర కౌన్సిలర్ చెరకు శ్రీనివాస్, సభ్యులు కేఎస్‌వీ రమేష్, బి.శంకరరావు, వెంకటరమణ, జె.నాగరాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


గజ్జరంలో దేవదాసు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఇనపాల దేవదాసు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గన్నిన రత్నాజీ, చిక్కాల మహేష్, ఎల్లిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెం వంతెన వద్ద భారీ ట్రాఫిక్


సమిశ్రగూడెం వంతెన వద్ద వృద్ధుడిని బయటకు తీసుకువస్తున్న స్థానికులు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలోని పురాతన వంతెన వద్ద సోమవారం మధ్యాహ్నం భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వంతెనపై వాహనాలతో పాటు కళాశాలల బస్సులు ఒక్కసారిగా రావడంతో సుమారు గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాటు ఎండ ఎక్కువగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వంతెన వద్ద సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడు అదుపు తప్పి రెయిలింగ్ మధ్య నుంచి కాలువలోకి పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి వృద్ధుడిని బయటకు తీశారు. సమిశ్రగూడెం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.